క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు


ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని బుధవారం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

వేళాంగిణి మాత చర్చి సందర్శన


చర్చిలో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం వేళాంగిణి మాత చర్చిను బుధవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. చర్చి ఫాదర్ సంతోష్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయనకు విజయ దీవెనలు అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమా రాణి, నిఖిలేష్ రాజ్‌కుమార్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీపై ఫిర్యాదు

మర్రిపాలెం: ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు, వెండి నగలు చోరీ అయినట్టు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సెక్టార్–8లో భర్తతో కలిసి నివసిస్తున్న ఉషశ్రీ ఏప్రిల్ 28న ఆమె పుట్టిల్లు సీలేరు లోని మారెమ్మతల్లి జాతరకని వెళ్లారు. 30న తిరిగి సీలేరులో బస్సు ఎక్కి బిర్లా జంక్షన్ వద్ద దిగి, అక్కడ ఓ హోటల్‌లో భోజనం చేసి ఆటో లో ఇంటికి చేరుకున్నారు. అక్కడ చూసేసరికి హ్యాండ్ బ్యాగ్ తెరచి ఉండటంతో చూడగా అందులో మూడున్నర తులాల బంగారు హారం, తులం నల్లపూసల దండ, చెవిబుట్టలు, ఉంగరం పావుతులం, వెండి పట్టీలు 6 తులాలు కనిపించలేదు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం రాత్రి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఎక్కిన ఆటోలో అదే సమయంలో ఇద్దరు మహిళలు ఎక్కారని ఫిర్యాదులో ఉషశ్రీ పేర్కొన్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అదృశ్యం


వి.సత్యనారాయణ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం గంగన్ననగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న వి.సత్యనారాయణ గత నెల 27న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడి తల్లిదండ్రులు హోటల్‌లో పనిచేస్తున్నారు. గత నెల 27వ తేదీ రాత్రి వారిద్దరు పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చి చూసేసరికి కుమారుడు కనిపించలేదు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సత్యనారాయణ తల్లి వి.గుణ ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు ఐదడుగుల మూడు అంగుళాల ఎత్తు, తెలుపు ఛాయ కలిగి సర్ఫ్ కలర్ షర్ట్, కాఫీ రంగు ఫ్యాంట్ వేసుకున్నాడు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.


48వ వార్డు బాపూజీనగర్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

నేను మీ వాడిని.. మీతోనే ఉంటా

- 'ఉత్తర' ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా
- ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా పూలవర్షం

కంచరపాలెం: ప్రజలంతా తన వారని.. తాను ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు.

ప్రజా సేవే తన లక్ష్యమని.. ఒక్క అవకాశమిచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరి చేత శభాష్ అనిపించుకుంటానని పేర్కొన్నారు.

జీవీఎంసీ 48వ వార్డులో పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కంచరపాలెం పరిధి బాపూజీనగర్, అంబేడ్కర్ నగర్, బర్మాక్యాంప్, శివలింగపురం తదితర కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి నివాసుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. దారిపొడవునా కె.కె.రాజుపై ప్రజలు పూల వర్షం కురిపించి హారతులతో స్వాగతం పలికారు. వృద్ధులు, పెద్దలు దీవెనలు అందించారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. విద్య, వైద్యం, ఉపాధితోపాటు పిల్లల భవిష్యత్ మెరుగుపడాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించే మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే జగనన్నను మనమంతా బలపరుచుకోవాలన్నారు. నియోజకవర్గంలో 20 ఏళ్లుగా ఉన్న అనేక సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కరించామని తెలిపారు. ఒక్క చాన్స్ ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని కె.కె.రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, సీనియర్ నాయకుడు బొగ్గు శ్రీను, కర్రి రామారెడ్డి, ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి, చిర్లా సత్యనారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి వసంతల అప్పారావు, మహిళా అధ్యక్షురాలు పద్మ, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- నేనున్నాను..


48వ వార్డులో వృద్ధురాలికి భరోసా ఇస్తున్న కె.కె.రాజు

- గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా


అబిద్‌నగర్ పార్కులో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మునుపెన్నడూ లేని అభివృద్ధి చేశాం

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో మునుపెన్నడూ లేని విధంగా ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 44వ వార్డు అబిద్‌నగర్ పార్కును బుధవారం ఉదయం ఆయన సందర్శించి వాకర్స్‌తో ముచ్చటించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 20 ఏళ్లుగా పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కరించామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం పలు రహదారులను విస్తరించామని చెప్పారు. నియోజకవర్గంలోని 17 వార్డుల్లో 13 వార్డులకు 24/7 తాగునీరు సరఫరా అయ్యేలా పనులు పూర్తి చేశామన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉన్న సబ్‌స్టేషన్లను అప్‌డేట్ చేయడమే కాక, పోర్టు స్టేడియం ఎదురుగా రూ.9 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.కె.రాజు

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 53వ వార్డుకు చెందిన బీజేపీ మాజీ ప్రెసిడెంట్ కె.భారతి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు గిరిజారాణి, బృంద, కరుణ, వినయ్, గోవిందరాజు, ప్రవీణ్, జగదీష్, యశ్వంత్, శ్రీనివాస్, ప్రసాద్, దిలీప్‌కుమార్, రాజు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజ్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

100 మంది చేరిక

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ అయ్యప్ప నివాసుల సంక్షేమ సేవా సంఘం సభ్యులు, నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం సాయంత్రం బర్మాక్యాంప్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సందర్భంగా పార్టీలో చేరిన వీరికి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలనను మెచ్చి సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సేవా సంఘం ప్రెసిడెంట్ డి.భాస్కరరావు, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఆర్.సతీష్, కె.గోవిందరాజులు, డి.మోహన్‌కుమార్, సిహెచ్.విశ్వనందన్, ధనరాజు, నూకరాజు, కమిటీ సభ్యులు, పలువురు నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, నాయకులు జి.వి.రవిరాజు, బొగ్గు శ్రీను, బి.అనురాధ, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన బర్మాక్యాంప్ అయ్యప్ప నివాసుల సంక్షేమ సేవా సంఘం సభ్యులు, నాయకులతో కె.కె.రాజు

కె.కె.రాజుకు నాగవంశీయుల మద్దతు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు నాగవంశీయులు తమ మద్దతు పలికారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బొడ్డు అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరలో కె.కె.రాజు గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, నాగవంశీయ సభ్యులు పాల్గన్నారు.


నాగవంశీయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

ప్రతి ఒక్కరూ ఓటేయాలి

సీతమ్మధార: ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 ఏళ్లు దాటిన వారంతా ఓటు వేయాలని సీఫా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ కోరారు. భారత ఎన్నికల సంఘం తరఫున స్వీప్ కార్యక్రమాన్ని బుధవారం సీతమ్మధార రైతుబజార్‌లో సీఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమేట్ టీం తదితర ఎన్‌జీవోలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బతికించాలన్నారు. మన ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. ఐదేళ్లపాటు మనల్ని సజావుగా పాలించే నాయకులను ఎన్నుకునే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జీవోల ప్రతినిధులు జె.వి.రత్నం, భానుప్రకాష్, కృష్ణకుమారి, రామలక్ష్మి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సీతమ్మధార రైతుబజార్‌లో ఓటు విలువపై ప్రచారం చేస్తున్న ఎన్‌జీవో ప్రతినిధి

'ఎన్నికల భారతం' పుస్తకావిష్కరణ

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల భారతం కవితా సంకలనం పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవితలు చదివి వినిపించారు. అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్.హనుమంతరావు, సి.ఎన్.క్షేత్రపాల్ రెడ్డి పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

కార్మిక వ్యతిరేక శక్తులను ఓడిద్దాం

సీతమ్మధార: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు జెండా ఆవిష్కరించి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక శక్తులను ఓడిద్దామని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం మూడేళ్లుగా సాగుతోందన్నారు. నమో అంటే నరేంద్ర మోదీ కాదని.. నమ్మించి మోసం చేయడమని ప్రజలంతా తెలుసుకోవాలన్నారు. ఐక్య కార్యాచరణ ద్వారా ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా కార్యదర్శులు పడాల గోవింద్, కోటా సత్తిబాబు, ఎ.శంకరావు, బోర రమణ తదితరులు పాల్గొన్నరు.


మేడే వేడుకల్లో ఏఐటీయూసీ నాయకులు

పారిశుధ్య కార్మికులకు వితరణ


సీనియర్ కార్మికుడిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు


పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకులు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు. కార్మికుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ, డిస్ట్రిక్ట్–101 పూర్వ గవర్నర్ యు.శుభ, జాలీ వాకర్ ప్రమీలరావు, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత, కార్యవర్గ సభ్యులు కె.బిందురాణి, సురేంద్ర కౌర్, ఎ.లీలావతి, పి.సుభద్ర, ఎం.స్వాతి మాధురి పాల్గొన్నారు.

కార్మికుల సేవలో మహిళా వాకర్స్

మేడే సందర్భంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్‌లో 50వ వార్డుకు చెందిన కార్మికులందరికీ ఎండవేడిమి నుంచి రక్షించేందుకు టోపీలు, బ్రెడ్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీనియర్ కార్మికుడు అర్జున్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, సూపర్‌వైజర్ సింహాచలం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, వాకర్స్ జిల్లా 101 పీఆర్‌వో కమల్ బెడ్, క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి పి.కమల, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, కార్యవర్గ సభ్యులు కె.సుగుణ, పి.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యేక స్థలం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ
- కూరగాయల సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే వారి కోసం ఇనార్బిట్ మాల్ సమీపంలో ప్రత్యేకంగా స్థలం ఏర్పాటు చేసి, వారికి మరింత ప్రోత్సాహం అందిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్‌లోని 45వ వార్డు ఎన్నికల ప్రచార కార్యాలయంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో బుధవారం కూరగాయల సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని విధాలా మేలు చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అందజేస్తున్నారన్నారు. ఈ సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించేందుకు ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

సమావేశం అనంతరం వివిధ పార్టీలకు చెందిన చిరువర్తక సంఘ నాయకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ కె.కె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు ఎమ్మెల్యేగా గెలవాలని వృద్ధులు దీవించారు. కార్యక్రమంలో శ్రీ దుర్గా వెజిటబుల్ మార్కెట్ సంఘం అధ్యక్షుడు వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రమణమ్మ, ఇతర సభ్యులు, ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు, కంపా హనోకు

శ్రామిక వర్గ చైతన్యం శ్రీశ్రీ


మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

సీతంపేట: మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ శ్రామిక వర్గ చైతన్యం, శ్రీశ్రీ మహాప్రస్థానం అభ్యుదయ సాహిత్యానికి మైలురాయని, ఈ శతాబ్దం నాది అని సగర్వంగా చెప్పుకున్న ఆత్మవిశ్వాసం శ్రీశ్రీదని పేర్కొన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ నూతన ప్రజాస్వామ్య విప్లవ కవితా రథసారధి, ఆధునిక కవిత్వానికి పథ నిర్దేశకుడని కొనియాడారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు స్ఫూర్తిదాయక కవితలు వినిపించారు.

చెత్తకు నిప్పు.. పొగతో ఇబ్బందులు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో దగ్ధమవుతున్న చెత్త నుంచి వ్యాపిస్తున్న పొగ

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రెండు రోజులకు ఒకసారి పారిశుధ్య సిబ్బంది చెత్తకుప్పలకు నిప్పు పెట్టి తగలబెట్టడం వల్ల వ్యాపించే పొగతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా.. వినకుండా చెత్తను తగలబెడుతున్నారని, తద్వారా ఏసీల నుంచి ఇంటి గదుల్లోకి పొగ రావడంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు నివాసులు కోరుతున్నారు.

నేటి నుంచి కూచిపూడి నృత్యంలో శిక్షణ

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం సీతారామ మందిరంలో మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి జూన్ 1 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు మీనాక్షి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూచిపూడి బేసిక్స్, కూచిపూడి ఐటమ్స్, కూచిపూడి థీమ్స్, ఫోక్ డాన్స్, సినీ క్లాసికల్ నృత్యాలపై ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటలకు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 76800 10709 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

కె.కె.రాజును గెలిపించాలని ఇంటింటా ప్రచారం

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించి, వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు కోరారు. 45వ వార్డులో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోర్ట్ క్వార్టర్స్, నరసింహనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి విశాఖతోపాటు ఉత్తర నియోజకవర్గ మరింత అభివృద్ధికి ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా కె.కె.రాజును గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఇన్‌చార్జి ప్రవీణ్ వర్మ, నాయకులు హరి పట్నాయక్, కారుకొండ రాజు, శ్యామ్, దుర్గ, నాయుడు, మాత ఈశ్వర్, ముప్పిడి రామారావు, అల్లాడ అప్పలరాజు, నర్సారావు, దొరబాబు, వేణు, ఆదిలక్ష్మి, సువర్ణ, తవుడమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.


పోర్టు క్వార్టర్స్‌లో ప్రచారం చేస్తున్న చొక్కాకుల వెంకటరావు, కంపా హనోకు తదితరులు

ప్రచార పర్వం


44వ వార్డు శ్రీనివాసనగర్‌లో కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్ - సీతంపేట


అక్కయ్యపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జైభారత్ పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి వి.వి.లక్ష్మీనారాయణ - సీతంపేట


50వ వార్డు మురళీనగర్ సెక్టర్–8లో కె.కె.రాజును గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ - మర్రిపాలెం